# కొంతమంది కుర్రాళ్ళు..!

ఉదయం పదకొండు గంటలయింది.... !

నగరానికి ఒక మూలగా వున్న ' ఊర్వశి' సినిమా హాలు ఆఫీసులో మొదటి గంట మ్రోగింది.

ఉదయపు ఆట 'శోభనం సోగ్గాడు' సినిమాకు టికెట్లు ఇవ్వడానికి తలుపులు తెరచుకున్నాయి. సాంబమూర్తి రెండవ తరగతి టికెట్లు ఇవ్వడానికిక సిద్ధమవుతూ కిటికీలోంచి బయటకు చూశాడు! బయట క్యూ పొడవుగా ఉంది. అతని ముందే కాక, అన్ని తరగతుల క్యూలు రద్దీగానే ఉన్నాయి. జనం గుంపులు గుంపులుగా ఉన్నారు. టికెట్ల కోసం ఒకర్ని ఒకరు తోసుకుంటూ, గోలగా ఎగబడుతున్నారు. వాళ్ళలో ముప్పాతిక వంతు కుర్రాళ్ళే.... కాలేజీపిల్లలు, యువకులు, నూనూగు మీసాలవాళ్ళు.... మీసాలు ముదిరిన వాళ్ళు... మూతి మీద ఇంకా మీసాలు రానివాళ్ళు....!

ఆ కుర్రాళ్ళని చూస్తూ సాంబమూర్తి భారంగా ఓ నిట్టూర్పు విడిచాడు..! ఆ నిట్టూర్పులో-నివురుగప్పిన నిప్పులాంటి భావం....! నిజానికి ఆ నిట్టూర్పు అతను ఈరోజు కొత్తగా విడుస్తున్నదికాదు....కొన్ని నెలలుగా, రోజులుగా తరచూ విడుస్తున్నదే...! సాంబమూర్తి టికెట్లు ఇవ్వడం మొదలుపెట్టాడు. కిటికీ ద్వారంలోంచి డబ్బులు తీసుకుంటున్నాడు. సరిచూసుకుంటున్నాడు. చిల్లరతో బాటు చకచకాటికెట్లు చించి, చేతిలో పెడుతున్నాడు. ఒక టికెట్టు చేతికిస్తూ కిటికీలోంచి ఆ కుర్రాడి ముఖం చూశాడు. వాడు అచ్చం తన కొడుకు భాస్కరంలాగే ఉన్నాడు... భాస్కరం గుర్తుకు రాగానే సాంబమూర్తిలో తెలియని చికాకు కలవరపెట్టింది. అతను డ్యూటీకి బయలుదేరేసరికి, భాస్కరం ఇంట్లో లేడు. ఏదో అవసరమైన పనుందనీ, బయటకు వెళ్ళాడంటూ, వాళ్ళమ్మచెప్పింది.

"ఇంత ప్రొద్దుటే, ఏంటో ఆ రాచకార్యం... ? బలాదూరుగా తిరగడమేగా...?" సాంబమూర్తి ఎగసిపడ్డాడు. గొంతు చించుకున్నాడు.... ఆవిడ ఎప్పటిలాగేవాడ్ని వెనకేసుకొచ్చింది. అనవసరంగా ఆడిపోసుకుంటున్నారంది. ఆందోళనపడి పోతున్నారంది. చివరగా' నాకొడుకు బంగారం' అంది.

భాస్కరం ప్రభుత్వకాలేజిలో బి.కామ్ చదివాడు...ఎంత ప్రయత్నించినా బి.యిడి. సీటు రాలేదు. వృత్తిపరమైన మరొక శిక్షణ ఏదైనా పొందమంటే, తనకిష్టం లేదంటాడు. తాత్కాలికంగా ఏదైనా ఉద్యోగం(చూ) చేసుకోరా అంటే సమాధానం చెప్పడు... నిర్లక్ష్యం తలబిరుసు... చిన్నా చితక ఉద్యోగాలు- చేయనంటూ, వాళ్ళమ్మతో బీరాలు పలుకుతుంటాడు. ఏకంగా కలెక్టరు అయ్యే పరీక్షలు ఏవో ఉన్నాయట.... తీరికగా అవి రాస్తాడట... రాసి రాసి ఎన్నేళ్ళకయినా తను అనుకున్నది సాధిస్తాడట...! కలలు కనడానికి లోటేమీలేదు... కాని కాళ్ళ మీద నిలబడి, ఆకాశం అందుకుంటానంటే ఎలా? ప్రయత్నం

కృషి లేనిదే .... ఫలితం ఎలా దక్కుతుంది...? సాంబమూర్తి తీరా సైకిలు తొక్కుకుంటూ సినిమా హాలుకు వస్తొంటే... భాస్కరం చౌరస్తాలో కిళ్ళీకొట్టు ముందు, స్నేహితులతో కులాసాగా కబుర్లు చెబుతూ కాలక్షేపం చేస్తున్నాడు. వాళ్ళల్లో ఇద్దరు బెంచీ మీద కూర్చుని సిగరెట్లు, కాలుస్తున్నారు. ఇద్దరు సినిమా పత్రికలు తిరగేస్తున్నారు. మరొకడు, 'నోట్లో ఏదో నములుతూ ఎవరో సినిమా హీరోని అనుకరించి చూపుతున్నాడు. భాస్కరం వాడ్ని చూసి, పగలబడి నవ్వుతూ చప్పట్లు కొడుతున్నాడు.....

సాంబమూర్తి మళ్ళీ దీర్ఘంగా ఓ నిశ్వాస విడుస్తూ... వాళ్ళని చూసీ చూడనట్లుగా ముందుకు వెళ్ళిపోయాడు.

సాంబమూర్తి అగ్రకులంలో పుట్టినా పేదరికం వల్ల పెద్దగా చదువుకోలేకపోయాడు. కులవృత్తీ కలసిరాలేదు. అతనికి దైవభక్తి, పాపభీతి ఎక్కువ....! చిన్నచిన్న ఉద్యోగాలు ఎన్నో చేసి, పొసగని రీతిలో... స్థితిలో, ఈ సినిమా హాల్లో చేరాడు. అతనిది, దిగువ మధ్యతరగతి జీవితమే. పూర్వీకుల నాటి పెంకుటిల్లు, కుటుంబం రోడ్డున పడకుండా కడుపులో పెట్టుకుంది. ఒక ఆడపిల్ల అంగన్‌వాడీ బడిలో పాఠాలు చెబుతూ, ఇంటి భారంలో వేణ్ణీళ్ళకు చన్నీళ్ళవుతోంది. ఆ పిల్లను ఓ ఇంటిదాన్ని చేయాలి. మరోపిల్ల అవిటిది... ఇంట్లో తల్లికి పచ్చళ్ళు చేయడంలో సాయపడుతుంది. అరుగుమీదకూర్చుని పిప్పరమెంట్లు, నిమ్మతొనలు, చుట్ట,బీడీ సిగరెట్లు పచ్చళ్ళు సీసాల్లో పెట్టుకుని అమ్ముతుంది. ఎటొచ్చీ ఇరవై ఏళ్ళొచ్చీ, భాస్కరం ఎందుకూ కొరగాకుండా తిరుగుతున్నాడనే సాంబమూర్తి బాధ...!

" పదిరూపాయలు ఎక్కువిచ్చేశారండీ!"

కిటికీ ముందు ఒక యువకుడు పది నోటు తిరిగిచ్చేడు. సాంబమూర్తి ఉలికి పాటుతో ఆ నోటు అందుకున్నాడు. "థేంక్సు బాబూథేంక్సు!" కృతజ్ఞతగా అన్నాడు. ఏభై రూపాయలకి, పదిహేను టిక్కెట్టుకు పోగా ముప్ఫై అయిదుతిరిగివ్వాలి. ఆలోచనల్తో అన్యమనస్కంగా నాలుగు పదులు ఒక అయిదు నాణెం ఇచ్చేశాడన్నమాట. సాంబమూర్తి ఒక్క క్షణం తలవిదిలించుకున్నాడు. మరింత జాగ్రత్తగా నోట్లు లెక్క పెడుతూ, టిక్కెట్లు చించుతున్నాడు. బయట కొంచెం గోల తగ్గింది. రద్దీ తగ్గింది..... క్యూలు ముందుకు కదులుతున్నాయి.

హాలు మేనేజరు, మంగపతి ఆఫీసు నుంచి వరండాలోకి అటునించి ఇటూ ఇటునుంచి అటూ టికెట్ల కౌంటర్లవద్దకు హడావిడిగా తిరుగుతున్నాడు. ఏ కౌంటర్లో ఎన్ని టిక్కెట్లు అమ్ముడయ్యాయో ఆరాలు తీస్తున్నాడు.

హాలులోపల స్టీరియో స్పీకర్లలో... " ఇప్పటికింకా నా వయసు నిండా పదహారే..." పాట పెద్ద పెట్టున హెూరెత్తిస్తోంది.

ఆఫీసులో ఫోను అదే పనిగా మ్రోగుతోంది.....!

మేనేజరు మంగపతి, పరుగెత్తుకు వెళ్ళి ఫోను తీశాడు. మాట మాటకు

"అయ్యో!అయ్యో! అంటున్నాడు. " అలాగేనండి! ఏంభయం లేదండీ!" అంటున్నాడు. అటువైపు నుంచి హాలు యజమాని భైరవయ్య అయిఉంటాడు. అతగాడికి నగరంలో నాలుగు మేడలున్నాయి. రెండు పెట్రోలు బంకులున్నాయి. మూడుధాన్యపు మిల్లులున్నాయి. చిట్‌ఫండ్ కంపెనీలున్నాయి. చీకటి వ్యాపారాలు ఇంకా ఎన్ని ఉన్నాయో! ఎన్ని ఉన్నా ఆకలెక్కువ... దాహమెక్కువ... డబ్బుకోసం ఎలాంటి గడ్డి అయినా తినడానికి సిద్ధం.... !

టిక్కెట్లు ఇంకా పదిలోపే ఉన్నాయి అనుకుంటూ సాంబమూర్తి క్యూలో జనంవైపు యథాలాపంగా చూశాడు. ఒక్క క్షణం గుండె గతుక్కుమంది. చేస్తున్న పని ఆపి, చేష్టలుడిగి చూస్తుండిపోయాడు. భాస్కరం, వాడి స్నేహితులు, అయిదుగురు కుర్రాళ్ళు హాలు ఆవరణలోకి వచ్చి అటువైపుగా అడుగులు వేస్తున్నారు. వాళ్ళ వెనుక, కొడుకు భాస్కరం నక్కినక్కి నడుస్తున్నాడు.....

సాంబమూర్తిలో తెలియని అలజడి... సిగ్గు.... ఛీత్కారం... కోపం... !

వీళ్ళు కూడా 'శోభనం సోగ్గాడు' సినిమాకు వచ్చారన్నమాట!

నివురు గప్పిన నిప్పు... ఒక నిట్టూర్పు... మరోసారి అతడ్ని అతలాకుతలం చేసింది.

'శోభనం సోగ్గాడు' మామూలు సినిమాకాదు. శృంగార అనువాద చిత్రం... సినిమా మొదటి నుంచి, చివరివరకూ మొగుడూ పెళ్ళాల సరస సల్లాపాల సన్నివేశాలు...! యువతను రెచ్చగొట్టి వాళ్ళు పెడదారి పట్టేలా... సభ్య ప్రపంచం కళ్ళు మూసుకునేలా ఉన్నాయి. పైగా - చిత్రం నిండా స్త్రీని పలుకోణాల్లో నగ్నంగా చూపించే దృశ్యాలు కోకొల్లలుగా ఉన్నాయి. ఆడామగా శృంగార కేళిని పచ్చిగా... ప్రత్యక్షంగా ప్రదర్శించి డబ్బులు చేసుకుంటున్నారు. ఎవరికి వారే! ఎవరూ పట్టించుకోరు.... భైరవయ్య పోలీసులకి నెలవారీగా లంచాలు దండిగా, ముట్టచెబుతాడు. వాళ్ళు కిమ్మనరు... వీళ్ళు నెలల తరబడి ఇలాంటి బూతు సినిమాలు, యథేచ్ఛగా, నిర్లజ్జగా ప్రదర్శిస్తుంటారు.. కుర్రాళ్ళ దౌర్భాగ్యం...! వయసు బలహీనతలు... చెడు వైపు చిత్రమైన ఆకర్షణ ఎగబడి చూస్తుంటారు... !

భాస్కరం, అతని స్నేహితులు ఎగువ తరగతి టిక్కెట్లు తీసుకున్నారేమో... వాళ్ళు హాలు లోపలికి వెళ్ళడం... ఎంత ప్రయత్నించినా సాంబమూర్తి కంటపడలేదు.... అతనిలో ఉద్రేకం... ఉద్వేగం... కొడుకు హాల్లోకి వెళ్ళాడన్న ఊహ అతడ్ని నిలువనివ్వడంలేదు.... !

టిక్కెట్లు అమ్మకం పూర్తిగా అయిపోవడంతో... కిటికీ రెక్కలు టప్‌మని మూసి వేశాడు సాంబమూర్తి!

'శోభనం సోగ్గాడు' ఉదయపు ఆట ప్రదర్శనకు చివరి గంట మ్రోగింది.

పిన్నలు, పెద్దలు టిక్కెట్లతో ఉరుకులు పరుగులు తీస్తున్నారు. హాలు తలుపులు, తెరలు మూసుకుంటున్నాయి. హాలు లోపల తన కొడుకు కూడా ఉన్నాడనుకుంటే... సాంబమూర్తి హృదయం కుతకుతా ఉడుకుతూంది... కుమిలిపోతూంది..

ఏం చెయ్యాలిపుడు..? తనేం చేయగలడు...? చీకట్లో వాణ్ని వెదికి పట్టుకుని... రెండుచెంపలూ వాయించి తీసుకెళ్ళగలడా...? పదిమందిలో ఎంత పరువు తక్కువ.... సిగ్గుచేటు పని....? ఎంత అవమానం...?

సాంబమూర్తి టిక్కెట్లు అమ్మగా వచ్చిన డబ్బులు మొత్తం ఆఫీసులో జమచేశాడు. లెక్కపూర్తిగా సరిపోలేదు. రెండు టిక్కెట్లుకు ముప్పై రూపాయలు తక్కువ వచ్చాయి. మేనేజరు మండిపడ్డాడు.... బతిమాలితే ఎలాగైతేనేం, నెలాఖరున జీతంలో కోసుకోవడానికి ఒప్పుకున్నాడు... ఎంత వద్దనుకున్నా... కొడుకు ఆలోచనలు ఈ పూట కలవర పెట్టాయి. వాడు వాడి స్నేహితులు, హాల్లోకి రావడంతో మనసు పిచ్చెక్కినట్లయింది.

సాంబమూర్తి మేనేజరుతో చెప్పి హాల్లోంచి బయటకు వచ్చాడు. రోడ్డెక్కి కొంత దూరం నడిచాడు. అక్కడ ఖాళీగా ఉన్న టెలిఫోను బూతులోకి దూరి తలుపులువేసుకున్నాడు. టెలిఫోను పెట్టెలో రూపాయి నాణెం వేశాడు. నంబరు నొక్కాడు. మాట్లాడుతూ మరో నాణెం వేశాడు. మరొకటి .... మరొకటి... అలా ఎనిమిది నాణేలు వేసి అక్కసుగా చెప్పాల్సింది చెప్పి వెనక్కి తిరిగివచ్చాడు. అప్పటికి హాల్లో విశ్రాంతి గంట మ్రోగింది...!

విశ్రాంతి తరువాత తిరిగి 'శోభనం సోగ్గాడు' సినిమా మొదలయింది.... !

సాంబమూర్తి హాలుకు రెండువైపులా ఉన్న వరండాలో వెర్రి వాడిలా అటూ ఇటూ తిరుగుతున్నాడు... ! విశ్రాంతి సమయంలో బయటకొచ్చిన జనంలో కూడా భాస్కరం వాడి స్నేహితులు కనిపించలేదు. వాళ్ళు తన నుంచి తప్పించుకోవడానికి హాలు లోపలే ఉండిపోయారనుకున్నాడు.

లోపల శృంగార సన్నివేశాలు నడుస్తున్నాయేమో... ఏవో నిట్టూర్పులు.... శబ్దాలు... మూలుగులు.. జుగుప్సావహంగా నేపథ్య సంగీతం... !

సాంబమూర్తికి అసహనంగా ఉంది. అసహ్యంగా ఉంది. కుర్రాళ్ళు చెడిపోతున్నారు. కాదు చెడగొట్టబడుతున్నారు. వాళ్ళు చెడిపోవడానికి సవాలక్ష దారులు తెరచి ఉంచుతున్నారు. యువత స్వేచ్ఛ... విచ్చలవిడితనం.. సెల్‌ఫోన్లు, వెబ్‌లు, పబ్‌లు, పెరిగిన సాంకేతిక విజ్ఞానం దుర్వినియోగం, పర్యవసానం, ఎన్ని నేరాలు... ? ఎన్ని ఘోరాలు... ఎన్ని అఘాయిత్యాలు.. ఎన్ని అత్యాచారాలు... ఎన్ని హత్యలు... ఆత్మహత్యలు..?

ఎటు చూసినా విధ్వంసకర దృశ్యాలే...!

సాంబమూర్తి ఒక నిర్ణయానికొచ్చి ముందుకు కదిలాడు. మరో గాఢమైన నిట్టూర్పు విడిచాడు.

'ఇంటికి పోవాలి! భోజనం చేసి మళ్ళీ మధ్యాహ్నం ఆటకు రావాలి!" సాలోచనగా సైకిల్ స్టాండువైపు అడుగులు వేస్తున్నాడు.....

అదిగో అప్పుడు... హాలు లోపల్నుంచి ఆరుగురు దృఢకాయులు వడివడిగా బయటకొచ్చారు. తెల్లబట్టల్లో బూట్లు టకటకలాడిస్తూ - మెట్లెక్కారు. సినిమా ప్రదర్శిస్తు కేబిన్‌లోకి పరుగులు పెట్టారు. లోపల ఏంజరిగిందో, 'శోభనం సోగ్గాడు' ప్రదర్శన అథాటుగా ఆగిపోయింది. హాల్లోని జనం ఈలలు వేస్తున్నారు. కొద్ది నిముషాల్లోనే ఆరుగురు దృఢకాయులు సినిమా రీళ్ళ చుట్ట చేతబట్టుకుని, ఠీవిగా క్రిందికి దిగి వచ్చారు. ఆఫీసు గదిలోకి దర్జాంగా నడిచారు. అప్పటికే వాళ్ళెవరో అందరికీ తెలిసిపోయింది. మేనేజరు మంగపతి వణికిపోతూ వాళ్ళకు దణ్ణాలు పెడుతున్నాడు.

హాల్లో జనానికి, వార్త ఎలా అందిందో, గుసగుసలాడుకుంటూ బయటకు జారిపోతున్నారు. వచ్చిన వాళ్ళలో ఒకరు జిల్లారెవెన్యూ అధికారి అట,... మరో ఇద్దరు సహాయ అధికారులట... మరో ముగ్గురు ప్రత్యేక పోలీసుదళం వారట... ! 'శోభనం సోగ్గాడు' సినిమా మధ్యలో నీలిచిత్రాల ముక్కల్ని ప్రదర్శిస్తున్నందుకు నేరారోపణ చేస్తూ కేసు రాశారు. ఆ రీళ్ళన్నిటిని ప్రత్యక్షంగా చూసి పట్టుకున్నట్టు... తాము స్వాధీనం చేసుకుంటునట్లు... గతంలో హెచ్చరికలు జారీ చేసినవా, ఖాతరు చేయనందున ప్రదర్శనలు నిలుపు చేస్తూ హాలు మొత్తానికి సీలు వేశారు. అక్కడికక్కడే ఉత్తర్వులు జారీ చేశారు. హాలు యజమాని భైరవయ్య లబోదిబోమంటూ 'మారుతీ'లో పరుగెత్తుకు వచ్చేసరికి, అందర్నీ బయటకు వెళ్ళమని, హాలుకు పెద్ద తాళం కప్పలు వ్రేలాడదీశారు. మేనేజరు మంగపతి, భైరవయ్యల్ని, కేబిన్‌లోని ఆపరేటర్ని తమ వెంట బందీలుగా అధికారులు తీసుకుపోయారు.

పెను తుపాను ఏదో వచ్చినట్లయింది.... తీరం దాటినట్లు అనిపించింది...

మిగతా పనివాళ్ళతో కలసి, సైకిలు తీసుకుని, హాలు ఆవరణలో సాంబమూర్తి నిలబడ్డాడు. అతని మనసిప్పుడు చల్లగాఉంది. ప్రశాంతంగా ఉంది. అలవికానంత ఆనందంగా ఉంది... అధర్మం దారి తప్పినప్పుడు... పెట్రేగిపోయినప్పుడు.. నేను అవతరిస్తాను, అన్న భగవానుడిని ఒక్కసారి తలుచుకున్నాడు.

హాలుకు తాళం కప్ప వేశారు కాబట్టి... రేపటి నుంచి తనకు ఉద్యోగం ఉండదు.... మరోదానిలో కుదురుకోవాలి... ఫరవాలేదు...! నిండుగా సంతోషాన్ని గుండెల్లో నింపుకుని, సాంబమూర్తి ఇంటిదారిపట్టాడు.....

❋ ❋ ❋ ❋ ❋ ❋

సాంబమూర్తి భోజనం ముందు కూర్చున్నాడు.!

భార్య భవాని, ఆధరువులు వడ్డిస్తోంది. కొడుకు భాస్కరం ఇంకా ఇంటికి రాలేదు. వాడు ఎప్పుడొస్తాడో తెలియదు. కొడుకును తలచుకుంటే, సాంబమూర్తికి గుండె మండుతోంది. ఏదో అవమానంగా, సిగ్గుగా... ఒళ్ళంతా కంపర మెత్తుతున్నట్లుగా వుంది.....!

అన్నం కలుపుతూ... తను పని చేసే హాలు మీద, అధికారులు దాడి చేయడం,

యజమాని భైరవయ్యను, మేనేజర్ని, ఆపరేటర్ని బందీలుగా తీసుకుపోవడం, వివరాలు భార్యతో చెప్పుకున్నాడు. రేపటి నుంచి మరో ఉద్యోగం చూసుకోవాలని కూడా అన్నాడు.

సాంబమూర్తి భోజనం పూర్తయ్యేసరికి కొడుకు భాస్కరం, పెరటివైపు గేటు తీసుకుని, అడుగాలో అడుగు వేస్తూ ఇంట్లోకి వచ్చాడు. బయట వంచలో బట్టలు మార్చుకుంటున్నాడు.... వాడి చూపుల్లో అదే నిర్లక్ష్యం.... పొగరు.... తలబిరుసు!

సాంబమూర్తి కొడుకు వైపు కొరకొరా చూశాడు....!

"నువ్వూ నీ స్నేహితులు ఉదయపు ఆట 'శోభనం సోగ్గాడు' సినిమాకి వచ్చారా...?" సాంబమూర్తి ఉద్రేకాన్ని అదుపు చేసుకుంటూ అడిగాడు. 'అవును వచ్చాం' అన్నట్టుగా భాస్కరం తల పంకించాడు.

"చూశావా ! నీ కొడుకు గొప్పతనం.. బూతు చిత్రాల్ని చూసే స్థాయికి ఎదిగిపోయాడు వాడు.

ఛీ... ఛీ... ! ఎంత సిగ్గులేకుండా చెబుతున్నాడో చూడు... వాడి మొహం చూడటానికే నాకు అసహ్యంగా ఉంది. వీడు కలెక్టరు పరీక్షలు రాస్తాడట... లోకాన్ని ఉద్ధరిస్తాడట... !" సాంబమూర్తి అసహనం, ఆక్రోశం హద్దులు దాటాయి...!

"ఏరా ! నీకసలు బుద్ధుందా... ? ఏదో చెత్తసినిమా చూడటానికి. స్నేహితుల్ని వెంట బెట్టుకుని అదీ, మీ నాన్న పనిచేసే హాలులోకి వెళ్తావా... ?ఎంత దిగజారిపోయావురా... ? నీ మీద ఎన్ని, ఎన్ని ఆశలు పెట్టుకున్నామురా.... ? మా బాధ, బెంగ నీ కెలా అర్థమవుతాయిరా...? గంట క్రితం ఆయన పక్కింటి ఫోనులో విషయం నాతో చెప్పి ఎంత కుమిలిపోయారో తెలుసా...? ఆసినిమాహాలు.. సీలు చేశారట... అధికారులెవరో దాడిచేసి..." భాస్కరం తల్లి కన్నీళ్ళు పెట్టుకుంటోంది.

"అవునమ్మా ! ఆ పని చేయించింది మేమేనమ్మా!"

భాస్కరం గొంతు స్ఫుటంగా పలికింది. సాంబమూర్తి తుళ్ళిపడ్డాడు... తల్లి తెల్లబోతూ చూస్తోంది....

"వాడు ఎప్పటి నుంచో, ఛండాలంగా... దరిద్రపు సినిమాల్ని చూపించి సొమ్ము చేసుకుంటున్నాడు నేనూ, నా స్నేహితులం వాడికి బుద్ధి చెప్పాలనుకున్నాం... పది రోజులుగా ప్రణాళిక వేశాం... అధికారులకి పదేపదే ఫిర్యాదులు చేశాం... అది ఫలించింది. ఈ రోజు వాళ్ళు దాడిచేస్తారన్న విషయం తెలిసింది. పరిస్థితి గమనించడానికన్నట్టుగా... మేమంతా ఒకసారి హాలు వద్దకు వచ్చాం గాని, ఆ చెత్త సినిమాచూడటానికి కాదు... నేనేమిటో.. నా లక్ష్యం... ఏమిటో నాకు తెలుసు... ! నా స్నేహితులూ అంతే....!"

భాస్కరం నిర్భయంగా, నిటారుగా నడుస్తూ పెరట్లోకి వెళ్తున్నాడు... !

సాంబమూర్తికి నోటమాట రాలేదు.

కొన్ని క్షణాలు... నిశ్చేతనగా నిలబడిపోయాడు...!

భాస్కరం, అతని స్నేహితులు, సినిమా హాలుపై దాడికి మూలకారకులా... ? ఎంత నిజం? ఎంత తియ్యటి వాస్తవం..? వాళ్ళు, కుర్రాళ్ళు... చెడిపోలేదు... చెడును సాహసంగా ఎదుర్కొన్నారు... వాళ్ళు చైతన్యం దారిలోనే నడుస్తున్నారు.... ఆ చైతన్యానికి అటూ ఇటూ ఆనవాళ్ళుగా ఉంటున్నారు. "కొంతమంది కుర్రాళ్ళు'' సరదాగా... తిరిగినా, సినిమాలు చూసినా, షికార్లు చేసినా... వాళ్ళ దృష్టి.. ధ్యేయం మీదే... ఉన్నతమైన భవిష్యత్తు సాధన మీదే... వాళ్ళకు తిరుగులేదు.... !

సాంబమూర్తి పెదాలపై చిరుదరహాసం... గర్వం తొంగి చూశాయి... ! పెరట్లోకి వెళ్తోన్న భాస్కరం వైపు ఆర్ద్రంగా చూశాడు... వాడి నిర్లక్ష్యం, చూపుల్లో కొత్త సమాధానం ఏదో దొరికింది.... !

సాంబమూర్తి నిశ్చింతగా గుండెల మీద చేయి వేసుకున్నాడు.... !

❋ ❋ ❋ ❋ ❋ ❋

(విశాఖ, ఆర్.ఎస్. కృష్ణమూర్తి స్మారక పురస్కారం.. ద్వితీయ బహుమతి...
ప్రచురణ : ఆంధ్రప్రదేశ్ రంజని.. ప్రత్యేక బహుమతి, డిసెంబరు - 2009)